క్లుప్తంగా

అపోహలు వద్దు

సాక్షి స్పందన

నడికూడ : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలనతో కొందరు లబ్ధిదారులు అయోమయానికి గురవుతున్నారు. దరఖాస్తుతో జత పరచాల్సిన జిరాక్స్‌ల విషయంలో స్పష్టత లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీనిపై సాక్షి దినపత్రికలో ఆదివారం అయోమయంలో లబ్ధిదారులు అనే కథనం ప్రచురితమైంది. కాగా, మండల స్పెషల్ ఆఫీసర్ డాక్టర్ వెంకటనారాయణ సాక్షి కథనంపై స్పందించి లబ్ధిదారులు కేవలం ప్రజా పాలన దరఖాస్తులో గ్యాస్ కనెక్షన్ నంబర్, సరఫరా చేస్తున్న కంపెనీ పేరు, విద్యుత్ మీటర్ కనెక్షన్ సంఖ్య వివరాలు ఇస్తే చాలని అన్నారు. అలాగే రైతు భరోసా, పింఛన్లపై అపోహలు వద్దని, కొత్త వారు మాత్రమే దరఖాస్తు చేయాలని తెలిపారు. దరఖాస్తు పత్రాలను ఎవరైనా విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని, రేషన్ కార్డు కోసం ప్రజాపాలన దరఖాస్తులో కుటుంబ వివరాలు ఇస్తే సరిపోతుందని, ఎలాంటి జిరాక్స్‌లు జతపరచాల్సిన అవసరం లేదని ఆయన అన్నారు.

క్రికెట్ టోర్నీ విజేతలకు బహుమతుల ప్రదానం



బహుమతులు అందజేస్తున్న సీఐ

గీసుకొండ : గ్రేటర్ వరంగల్ 15వ డివిజన్ మొగిలిచర్ల శివారులోని ఎంసీజీ గ్రౌండ్స్‌లో నిర్వహించిన క్రికెట్ టోర్నీ విజేతలకు ఆదివారం సాయంత్రం స్థానిక సీఐ రామకృష్ణ బహుమతులు ప్రదానం చేశారు. ఫైనల్ మ్యాచ్‌లో గెలిచిన కల్ట్ 11 టీంకు రూ.40 వేల నగదు, రన్నరప్‌గా నిలిచిన ఎం3 సొల్యూషన్ జట్టుకు రూ. 20 వేల నగదు బహుమతి అందించారు. మ్యాన్ ఆఫ్ ది సిరీస్‌గా జహీరుద్దీన్ ఖలీద్, బెస్ట్ బ్యాట్స్‌మెన్‌గా ఎండీ సమీర్‌లు నిలువగా నిర్వాహకులు అఖిల్, నాగరాజు, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు ఆర్థికసాయం

హసన్‌పర్తి : జాతీయ స్థాయి తంగ్–తా మార్షల్ ఆర్ట్స్‌కు ఎంపికైన వంగపహాడ్ పాఠశాలకు చెందిన పి.హర్షిత, ఎస్.అక్షితకు మాజీ ఎంపీటీసీ మార్త రవీందర్ ఆర్థికసాయం చేశారు. జనవరి 11నుంచి 17వ తేదీ వరకు న్యూఢిల్లీలో జరగనున్న జాతీయ స్థాయి పోటీల్లో ఇరువురు క్రీడాకారిణులు పాల్గొననున్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షుడు పొన్నాల రఘు, స్థానికులు, తదితరులు పాల్గొన్నారు.

3న సర్వసభ్య సమావేశం

సంగెం : మండల పరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం ఎంపీపీ కళావతి అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ కాసర్ల రవీందర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 3న ఎంపీడీఓ కార్యాలయంలో ఉదయం 11గంటలకు సర్వసభ్య సమావేశం ఉంటుందన్నారు. ఈ సమావేశానికి అన్ని శాఖల అధికారులు సమగ్రమైన ప్రగతి నివేదికలతో, ప్రజాప్రతినిధులు సకాలంలో హాజరు కావాలని ఆయన కోరారు.

దహన సంస్కారాలకు ఆర్థికసాయం



గీసుకొండ : మండలంలోని మరియపురం గ్రామానికి చెందిన బిట్ల స్వర్ణ (35) అనారోగ్యంతో బాధపడుతూ ఆదివారం మృతి చెందింది. ఆమె భర్తతో పాటు కుటుంబ సభ్యులను సర్పంచ్ అల్లం బాలిరెడ్డి పరామర్శించి దహన సంస్కారాల నిర్వహణ కోసం రూ. 5 వేల సాయం అందించారు.

మనుగొండలో..

మండలంలోని మనుగొండకు చెందిన సిద్దోజు వీరాచారి అనారోగ్యంతో మృతి చెందగా బాధిత కుటుంబానికి ఆదివారం కాంగ్రెస్ మండల నాయకుడు కొమ్ము శ్రీకాంత్ రూ. 5 వేల సాయం అందించారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. నాయకులు కందికొండ రాజు, మర్రి చేరాలు, సాంబయ్య, కొమురయ్య, క్రాంతితో పాటు తదితరులు ఉన్నారు.

అజర ఆస్పత్రిలో నేటి నుంచి వైద్యశిబిరం

ఎంజీఎం: అజర ఆస్పత్రిలో జనవరి 1నుంచి 31వ తేదీ వరకు ప్రివెంట్ హెల్త్ చెకప్ క్యాంపును నిర్వహించనున్నట్లు ఆస్పత్రి నిర్వాహకులు తెలిపారు. 54శాతం ప్రత్యేక తగ్గింపుతో బాడీ చెకప్ అందుబాటులో ఉన్నట్లు వివరించారు. రూ.17,420 విలువ గల వైద్య పరీక్షలను రూ.7,999లకే నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆరోగ్య ప్యాకేజీలను ఆన్‌లైన్ బుక్‌చేసే వారికి అదనంగా రూ.500 తగ్గింపు ఇవ్వనున్నట్లు చెప్పారు. మరిన్ని వివరాలకు 93910 09701, 93910 09702 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

మద్యం తాగి వాహనాలు నడుపొద్దు

● ఏసీపీ కిశోర్‌కుమార్



పరకాల: బ్రీత్ ఎనలైజర్ టెస్ట్ చేస్తున్న పోలీసులు

పరకాల : కొత్త సంవత్సరం వేడుకలను ప్రజలు సంతోషంగా నిర్వహించుకోవాలని పరకాల ఏసీపీ కిశోర్‌కుమార్ కోరారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు పరకాల బస్టాండ్ కూడలిలో స్థానిక ఏసీపీ కిషోర్‌కుమార్ ఆధ్వర్యంలో డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు చేపట్టారు. మద్యం మత్తులో వాహనాలను నడుపుతున్న వారిపై కేసులు నమోదు చేశారు. పోలీసుల తనిఖీలతో మందు బాబుల్లో హడల్ పుట్టించాయి. రాత్రి 9గంటల నుంచి అర్ధరాత్రి 1గంట వరకు తనిఖీలు కొనసాగుతాయని, ప్రతీ ఒక్కరు వేడుకలను సంతోషంగా జరుపుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సీఐ వెంకటరత్నం, ఎస్సైలు శివకృష్ణ, రమేష్ పాల్గొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలు

గీసుకొండ : గ్రేటర్ వరంగల్ పరిధి ధర్మారం సమీపంలోని కమర్షియల్ హోల్ సేల్ కాంప్లెక్స్ వద్ద గీసుకొండ పోలీసులు ఆదివారం రాత్రి వరంగల్–నర్సంపేట రహదారిపై డ్రంకెన్‌డ్రైవ్ పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షల్లో మద్యం తాగిన ఇద్దరిపై కేసు నమోదు చేశామని తెలిపారు. ఈ సందర్భంగా సీఐ రామకృష్ణ మాట్లాడుతూ.. మద్యం తాగి వాహనాలు నడుపొద్దని సూచించారు. తనిఖీల్లో ఎస్సై వెంకన్న, సిబ్బంది పాల్గొన్నారు.

శాంతిభద్రతలకు భంగం కలిగిస్తే చర్యలు

ఖిలా వరంగల్: రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలని, శాంతి భద్రతలకు భంగం కలిగిస్తే చర్యలు తీసుకుంటామని మిల్స్‌కాలనీ ఇన్‌స్పెక్టర్ సురేష్‌గౌడ్ హెచ్చరించారు. నూతన సంవత్సర వేడుకల సందర్భంగా వరంగల్ మిల్స్‌కాలనీ పోలీస్ స్టేషన్ ఆవరణలో ఆదివారం సాయంత్రం రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రౌడీషీటర్లపై ప్రత్యేక నిఘా పెట్టామని అన్నారు. రౌడీషీటర్లు సెటిల్‌మెంట్లు, గొడవలు, బెదిరింపులకు పాల్పడితే, భూ దందాల్లో తలదూర్చితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. నూతన సంవత్సర వేడుకల్లో హద్దుమీరొద్దని తెలిపారు. కార్యక్రమంలో ఎస్సైలు వెంకన్న, పున్నంచందర్, సిబ్బంది పాల్గొన్నారు.

ఆత్మరక్షణకు కరాటే దోహదం



బ్లాక్‌బెల్టులు, కలర్ బెల్టులు ప్రదానం చేసిన గ్రాండ్ మాస్టర్ నాయిని సదానందం

కాజీపేట రూరల్: శారీరక దృఢత్వం, ఆత్మస్థైర్యానికి కరాటే ఎంతో దోహదపడుతుందని స్వాడ్స్ కాయ్ షాటోకాన్ కరాటే అకాడమీ ఇండియా ఫౌండర్ అండ్ ఎగ్జామినర్ మాస్టర్ నాయిని సదానందం సూచించారు. కాజీపేట రైల్వే మజ్దూర్ యూనియన్ మీటింగ్ హాల్‌లో విద్యార్థులకు కరాటే గ్రేడింగ్ టెస్ట్, బెల్టులను ఆదివారం ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు విద్యతో పాటు కరాటే నేర్చుకోవడం వల్ల ధైర్య సాహసాలు ప్రదర్శించవచ్చని, తమను తాము రక్షించుకోవచ్చని వివరించారు. అనంతరం, సదానందం జె.పురవ్ తేజ్, ఎస్.త్రిలోక్‌కు బ్లాక్‌బెల్ట్ ఫస్ట్ డాన్, పి.కౌశిక్, ఎం.వైభవ్, సీహెచ్.దీపక్‌సాయికి బ్లాక్‌బెల్ట్ సెకండ్ డాన్ ప్రదానం చేశారు. మరో 31మందికి కలర్‌బెల్టులు అందజేశారు. ఆర్.దుర్గాప్రసాద్ సీనియర్ బ్లాక్ బెల్ట్ కో ఎగ్జామినర్‌గా వ్యవహరించిన కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పేదలకు చేయూతనందించాలి



కమాండెంట్ శివప్రసాద్‌రెడ్డిని సనానిస్తున్న రిటైర్డ్ పోలీస్ అధికారులు

ఖిలా వరంగల్: రిటైర్డ్ పోలీసు అధికారులు సేవాదృక్పథంతో అనాథ వృద్ధులు, పేద పిల్లలకు చేయూతనందించాలని టీఎస్ఎస్పీ నాలుగో బెటాలియన్ కమాండెంట్ శివప్రసాద్‌రెడ్డి సూచించారు. టీఎస్ఎస్పీ రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరిస్తూ వారి సంక్షేమానికి మరింతగా కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. రిటైర్డ్ పోలీస్ ఆఫీసర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ 6వ వార్షికోత్సవం సందర్భంగా వరంగల్ – ఖమ్మం రోడ్డులో అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు, రిటైర్డ్ డీఎస్పీ అంబాల ఉదయ్‌కిరణ్, అధ్యక్షుడు రంగరాజు ప్రకాశ్, కార్యదర్శి ఇనుగాల జోగిరెడ్డి అధ్యక్షతన రిటైర్డ్ పోలీస్ ఆఫీసర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం ఆదివారం జరిగింది. ముఖ్యఅతిథిగా ఆయన హాజరై మాట్లాడుతూ రిటైర్డ్ అధికారులు సమష్టిగా అసోసియేషన్‌ను ఏర్పాటు చేసి సభ్యులతోపాటు అనాథ వృద్ధులు, పిల్లలకు చేయూతనిస్తూ, వారి అభ్యున్నతికి పాటుపడటం అభినందనీయమని ప్రశంసించారు. అనంతరం కోశాధికారి కత్తి సమ్మయ్య ఆర్థిక నివేదికను సభ్యుల ముందు ప్రవేశపెట్టగా సభ్యులందరు ఏకగ్రీవంగా ఆమోదించారు. కార్యక్రమంలో రిటైర్డ్ అధికారులు ఎం.లక్ష్మయ్య, సీహెచ్.సత్తయ్య, కత్తి సమయ్య, ఎంఏ.ఖాదర్, నూరొద్దీన్, జయేందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, ఎండీ.సర్వర్, సయ్యద్‌ఖాజా, జయదేవరెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, పీ.చంద్రయ్య, కుమారస్వామి, విజేందర్‌రెడ్డి, ముర్గన్ పాల్గొన్నారు.

పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు

శాయంపేట : మండల కేంద్రంలోని ప్రభుత్వ జెడ్పీ ఉన్నత పాఠశాలలో 1973–74వ సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం స్వర్ణోత్సవ ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించారు. ముందుగా అప్పటి గురువులు, తోటి విద్యార్థులు మృతిచెందిన వారి ఆత్మకు శాంతి చేకూరాలని రెండు నిమిషాలు మౌనం పాటించి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం వృద్ధాప్యంలో కలుసుకున్నప్పటికీ చిన్ననాటి మధుర స్మృతులను నెమరవేసుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులు ఎండి సర్వర్, గౌరోజు చంద్రమౌళి, వేముల ప్రతాప్ రెడ్డి, ఎస్.సాయన్నలను శాలువాలతో సన్మానించి మెమోంటోలతో సత్కరించారు. పూర్వ విద్యార్థులు బోల్లోజు కృష్ణమూర్తి, డాక్టర్ రేపల్లె శేషాంజన్, కొడకండ్ల వెంకటేశ్వర్లు, జిన్నా రాజేందర్, లోకల సమ్మయ్య, వెంకటయ్య, భిక్షపతి, వెంకటేశ్వర్లు, సాంబయ్య, శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'సీపీఐవి అవకాశవాద రాజకీయాలు'

పరకాల : తెలంగాణ రాష్ట్రంలో భారతీయ జనతా పార్టీకి ఒక్క సీటు గెలువనీయబోమని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు చేసిన వ్యాఖ్యలు హాస్యస్పదమని పరకాల మున్సిపల్ మాజీ చైర్మన్ మార్త రాజభద్రయ్య అన్నారు. 2024 పార్లమెంట్ ఎన్నికల్లో వరంగల్ స్థానాన్ని బీజేపీ కైవసం చేసుకోవడం ఖాయమన్నారు. తెలంగాణలో సీపీఐ అవకాశవాద రాజకీయాలకు పాల్పడుతోందన్నారు. రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్, సీపీఐ లోపాయికారి ఒప్పందాలు చేసుకున్నారని రాజభద్రయ్య ఆరోపించారు.

'పరకాల చరిత్రను గుర్తించండి'



పరకాల : పరకాలను అమరవీరుల జిల్లాగా ప్రకటించాలని పలువురు వ్యాపారస్తులు పిలుపునిచ్చారు. పరకాలను వెంటనే జిల్లా కేంద్రం చేయాలని కోరుతూ ప్రతి ఇంటా కొత్త సంవత్సరం రోజున పరకాల చరిత్రను గుర్తించేలా ముగ్గులు వేయాలని సోషల్ మీడియా వేదికగా అమరధామం చిత్రంతో కోరారు.

నేడు అయ్యప్పకు విశేష పూజలు

హన్మకొండ కల్చరల్: వరంగల్ భద్రకాళి రోడ్డులోని శ్రీధర్మ శాస్తా అయ్యప్ప భక్త సేవాశ్రమంలో అయ్యప్పస్వామికి సోమవారం విశేష పూజలు, భక్తులకు మహా అన్నప్రసాదాల వితరణ నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకుడు గణపతిశర్మ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో భాగంగా సేవాశ్రమం నిర్వాహకులు పాల్గొన్నారు.

19వ డివిజన్ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారిస్తా



మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

కాశిబుగ్గ: నగరంలోని 19వ డివిజన్‌లో మౌలిక వసతుల కల్పన కోసం, అభివృద్ధి పనులు చేపట్టేందుకు ప్రత్యేక దృష్టి సారిస్తానని రాష్ట్ర అటవీ, దేవాదాయ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. హనుమకొండ రాంనగర్‌లో డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దాసరి రాజేష్ ఆధ్వర్యంలో కాలనీవాసులు ఆదివారం మంత్రిని కలిసి వినతిపత్రం అందజేశారు. డివిజన్‌లోని సీతారామస్వామి ఆలయంలో కల్యాణ మండపానికి నిధులు కేటాయించాలని, భగత్‌సింగ్‌నగర్‌లో పట్టాలు, పోచమ్మగుడి అభివృద్ధి, ఎరుకల వాడలోని బతుకమ్మ చెరువును పరిరక్షించి చుట్టూ హద్దులు నిర్ధారించాలని సొసైటీ కాలనీలోని శ్మశానవాటికను కబ్జా దారుల నుంచి కాపాడి ప్రహరీ, వివేకానంద కాలనీలోని ఎరుకల వాడలో కమ్యూనిటీ హాల్ నిర్మాణం, పోచమ్మగుడి అభివృద్ధితో పాటు డివిజన్‌లోని కాలనీల్లో రోడ్లు, డ్రైనేజీలు, నిర్మించేందుకు నిధులు మంజూరు చేయాలని మంత్రిని కోరారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి



మల్లేష్ (ఫైల్)

దామెర : చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని సింగరాజుపల్లిలో ఆదివారం చోటుచేసుకుంది. ఎస్సై కొంక అశోక్ తెలిపిన వివరాలు.. సింగరాజుపల్లికి చెందిన ఒడ్డెపల్లి మల్లేష్ ఇంటి నిర్మాణంలో భాగంగా మొరం అవసరం ఉండి డిసెంబర్ 20న పసరగొండ గ్రామానికి చెందిన మంద రాజును తన పొలంలో నుంచి మొరం తీసి పోయాల్సిందిగా కోరాడు. అందుకు ఒప్పుకున్న రాజు అదేరోజు రాత్రి మొరం తవ్వి ఇతరులకు పోశాడు. ఇది గమనించిన మల్లేష్ అక్కడి వెళ్లి తన పొలంలో నుంచి మొరం తవ్వి తనకు పోయకుండా వేరేవారికి ఎలా పోస్తావని నిలదీశాడు. దీంతో అక్కడున్న వారు నీకు మొరం పోసేది లేదని, దిక్కున్న చోట చెప్పుకోమని బెదిరించారు. దీంతో మనస్తాపానికి గురైన మల్లేష్ రాత్రి ఇంటికి వచ్చి తన భార్యతో జరిగిన విషయం చెప్పుకుని బాధపడ్డాడు. మరుసటి రోజు తీవ్ర మనస్తాపానికి గురై పొలంలో మొరం తీసిన స్థలం వద్దకు వెళ్లి గడ్డిమందు తాగాడు. గమనించిన బంధువులు చికిత్స నిమిత్తం ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. కాగా చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు. తన భర్త మృతికి కారకులైన మంద రాజు, ఒడ్డెపల్లి మొగిలి, ఉప్పుల శివపై కేసు నమోదు చేయాలని మృతుని భార్య మమత ఫిర్యాదు చేసింది. ఈమేరకు వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

గౌరవ వేతనం అమలయ్యేలా చూడండి



మంత్రి సీతక్కను సన్మానిస్తున్న రేషన్ డీలర్ల సంఘం నాయకులు

హన్మకొండ అర్బన్: రేషన్ డీలర్లకు గౌరవ వేతనం త్వరగా అమలయ్యేలా చూడాలని డీలర్ల సంఘం నాయకులు కోరారు. ఈమేరకు రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్కకు విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బత్తుల రమేష్‌బాబు, జన్ను రవి ఆధ్వర్యంలో పలువురు నాయకులు మంత్రి సీతక్కను ఆదివారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు చిలగాని మోహన్, పోతరాజు రమేష్, బత్తుల మహేష్, విజయపాల్, ఆర్.సంధ్యారెడ్డి, భాస్కర్, సునిల్, సతీష్, రాజ్‌కుమార్, కమలాకర్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

ప్రొఫెసర్ రాజిరెడ్డికి ఘన సన్మానం



రాజిరెడ్డిని సన్మానిస్తున్న గోపాల్‌రెడ్డి, పాపిరెడ్డి

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలోని కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ కళాశాలలో ప్రొఫెసర్‌గా పనిచేస్తూ ఉద్యోగ విరమణ పొందిన ప్రొఫెసర్ కే.రాజిరెడ్డిని కళాశాల సెమినార్ హాల్‌లో పరిశోధకులు ఆదివారం సన్మానించారు. ముఖ్యఅతిథిగా కాకతీయ యూనివర్సిటీ మాజీ వీసీ ప్రొఫెసర్ గోపాల్‌రెడ్డి, విశిష్ట అతిథిగా తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి మాజీ చైర్మన్ ప్రొఫెసర్ పాపిరెడ్డి పాల్గొని మాట్లాడారు. ప్రొఫెసర్ రాజిరెడ్డి అందించిన విద్యాపరమైన, పరిశోధనల పరంగా అందించిన సేవలను కొనియాడారు. కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్‌గా, బీఓఎస్‌గా, డీన్‌గా, ఐసెట్ కన్వీనర్‌గా ఆయన అందించిన సేవలను ప్రశంసించారు. కార్యక్రమంలో రిటైర్డ్ ప్రొఫెసర్లు నరసింహామూర్తి, కృష్ణమాచారి, ఇంద్రసేనారెడ్డి, పరిశోధకులు డాక్టర్ శంకర్, డాక్టర్ ప్రసాద్‌బాబు, డాక్టర్ వడ్డెపెల్లి మధు, డాక్టర్ అశోక్, డాక్టర్ బక్కి శ్రీనివాస్, డాక్టర్ కిరణ్, డాక్టర్ ఐలయ్య, డాక్టర్ హరిణి, వంశీ, కాంట్రాక్టు అధ్యాపకులు, పార్ట్‌టైం అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు. కాగా, రాజిరెడ్డిని అతిథులు, పరిశోధకులు సన్మానించారు.

బాధిత కుటుంబాలకు ఆర్థికసాయం



ఐనవోలు: పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే అరూరి రమేశ్ తదితరులు



కమలాపూర్: సాయం అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

కమలాపూర్ : మండలంలోని ఉప్పల్ గ్రామానికి చెందిన మొటం హరిచంద్రు అనారోగ్యంతో ఆదివారం మృతి చెందాడు. కాగా, బాధిత కుటుంబ సభ్యులకు ప్రముఖ వ్యాపారవేత్త, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు స్వర్గం రవి రూ.5 వేలు ఆర్థిక సాయం అందించి సంతాపం తెలిపారు. ఈ సందర్భంగా రవి పంపించిన నగదును స్థానిక బీఆర్ఎస్ నాయకులు బాధిత కుటుంబీకులకు అందజేశారు. మండల కో ఆప్షన్ సభ్యుడు ఖాజా హసనొద్దీన్, గ్రామ శాఖ మాజీ అధ్యక్షుడు మొండెద్దుల రాజమౌళి, నాయకులు జక్కుల సదయ్య, తూర్పాటి ఉపేందర్, కడమంచి రాజయ్య, కుమార్, మొటం రాంబాబు, రవితో పాటు తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే అరూరి పరామర్శ

ఐనవోలు : మండలంలోని కాపుల కనపర్తి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు సింగారపు రాజు సోదరి జూపాక వెంకటమ్మ ఇటీవల మృతిచెందింది. కాగా, విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే అరూరి రమేశ్ ఆదివారం రాజుతో పాటు వెంకటమ్మ కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు శంకర్‌రెడ్డి, సర్పంచ్ స్వర్ణ రవి, సురేష్, ఆగయ్య, రమేశ్, వెంకట్‌రెడ్డి, పుష్ప, మాణిక్యం, కొమురయ్య, నాగరాజుతో పాటు తదితరులు ఉన్నారు.

మిత్రుడి కుటుంబానికి..



దామెర: సాయం అందజేస్తున్న మిత్రులు

దామెర : మండల కేంద్రానికి చెందిన బండి రాజేష్ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. కాగా, 2010–11 బ్యాచ్‌కు చెందిన పదోతరగతి మిత్రులు ఆదివారం రాజేష్ కుటుంబ సభ్యులను ఓదార్చి, ప్రగాఢ సంతాపం తెలిపారు. అనంతరం రూ.32వేల ఆర్థికసాయం అందజేసి తమ ఉదారతను చాటుకున్నారు.

మెట్టుగుట్టపై కేంద్ర మంత్రి పూజలు



ప్రత్యేక పూజలు చేస్తున్న కేంద్ర సహాయ మంత్రి బీఎల్.వర్మ తదితరులు

మడికొండ : మడికొండలోని మెట్టు రామలింగేశ్వర స్వామి ఆలయాన్ని ఈశాన్య ప్రాంతాల అభివృద్ధి సహాయక మంత్రి బీఎల్.వర్మ ఆదివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా మంత్రికి అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో పంచామృతాలతో స్వామి వారికి మంత్రి.. అభిషేకం, అర్చనలు నిర్వహించారు. సీతారామచంద్ర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ చరిత్ర, ప్రత్యేకతలను అడిగి తెలుసుకున్నారు. ఆలయ భూమిలో నిర్మిస్తున్న రైల్వే పీరియాడికల్ వర్క్ షాప్‌నకు కేటాయించిన స్థలాన్ని గుట్టపై నుంచి పరిశీలించారు. మంత్రి వెంట బీజేపీ హనుమకొండ, వరంగల్ జిల్లాల అధ్యక్షులు రావు పద్మ, మాజీ ఎమ్మెల్యే కొండేటి శ్రీధర్, మాజీ మంత్రి గుండె విజయ రామారావు, నాయకులు ఉమారాణి, ఆలయ కార్య నిర్వాహణాధికారి శేషభారతి, అర్చకులు రాగిచేడు అభిలాష్‌శర్మ, పరాశరం విష్ణువర్ధనచార్యులు, సత్యనారాయణ శర్మ, మణిశర్మ, సాయిశర్మ, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


నేడు శ్రీరామ పూజిత అక్షింతల వితరణ ప్రారంభం

హన్మకొండ కల్చరల్: అయోధ్య శ్రీరాముల వారి ప్రతిష్ఠాపన సందర్భంగా శ్రీరాముడి పూజిత అక్షింతలు నగరంలోని ప్రతి ఇంటికి వితరణ ప్రారంభోత్సవ కార్యక్రమం జరగనుందని విశ్వహిందూ పరిషత్ వరంగల్ కార్యదర్శి శ్రీరామ్ ఉదయ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం 10గంటలకు వరంగల్ పోచమ్మమైదాన్ పోచమ్మగుడి వద్ద విశ్వహిందూ పరిషత్ కేంద్రీయ కార్యక్రమ సభ్యులు యక్కలి రాఘవులు ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభిస్తారని తెలిపారు.

రేపు శ్వేతార్కలో చిత్రాన్నపూజ

కాజీపేట: కాజీపేట పట్టణంలోని స్వయంభూ శ్వేతార్క మూలగణపతి దివ్యక్షేత్రంలో మంగళవారం సహస్రాదిక రుచికర చిత్రాన్నపూజ (పులిహోరతో) నిర్వహించడానికి ఆలయ నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆలయ వ్యవస్థాపకుడు ఐనవోలు అనంత మల్లయ్యశర్మ సిద్ధాంతి ఆధ్వర్యంలో 22 ఏళ్లగా జనవరి నెల మొదటి మంగళవారం శ్వేతార్క ఆలయంలో చిత్రాన్నపూజ ఘనంగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. భక్తులు ఆయా ఇళ్లల్లో తయారు చేసి తీసుకొచ్చిన పులిహోరను శ్వేతార్కుడికి నైవేద్యంగా సమర్పించడం ఏడాదిలో ఒక్కసారే జరుగుతుంది. అదే చిత్రాన్నపూజ. మంగళవారం సాయంత్రం 5గంటలకు చిత్రాన్నపూజ ప్రారంభం కానుంది.

'కాఫీ విత్ గవర్నర్'



హసన్‌పర్తి: వాసవీ క్లబ్ హసన్‌పర్తి ఆధ్వర్యంలో ఆదివారం 'కాఫీ విత్ గవర్నర్' కార్యక్రమాన్ని నిర్వహించారు. వాసవీ క్లబ్ ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన గంపా సాంబమూర్తిని ఆహ్వానించారు. కార్యక్రమాన్ని పురస్కరించుకుని గవర్నర్‌ను శాలువాతో సన్మానించారు. అనంతరం జరిగిన సమావేశంలో సాంబమూర్తి మాట్లాడుతూ.. క్లబ్ సభ్యులు సామాజిక కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనాలని సూచించారు. వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ చకిలం రాజేశ్వర్‌రావు మాట్లాడుతూ.. విజ్ఞాన, ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణం ద్వారానే అభివృద్ధి సాధ్యమని వివరించారు. క్లబ్ అధ్యక్షుడు చిదర కరంచంద్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో కార్యదర్శి మంచెన శ్యాంసుందర్, జోన్ చైర్మన్లు అప్పని శంకర్, నాగమళ్ల సుధీర్, భీష్మనాథం, క్లబ్ సభ్యులు మాధవశంకర్, సంద్రు నటరాజ్, శ్రీనివాస్, సతీష్ పాల్గొన్నారు.